క్లుప్తంగా

అర్జీల సమస్యలు పరిష్కారం కావాలి

మార్టూరు: రెవెన్యూ అధికారుల వద్దకు అర్జీదారులు ఎంతో నమ్మకంతో వస్తారని.. వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా అధికారులు సిబ్బంది ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్పందన అర్జీల పరిష్కారం కోసమే వచ్చిన ఆయన అధికారులు సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీ వెంకటరెడ్డి, డీటీ మెహతాజ్ బేగం, ఆర్ఐ బాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి విశేష స్పందన

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ రెడ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో మండల తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి రక్తదానం చేశారు. కార్యక్రమం గీతా మందిరంలో క్లబ్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణ దానంతో సమానమన్నారు. సీఐ రోశయ్య మాట్లాడుతూ రక్తదానం చేసిన దాతకు కొత్త రక్తం పుట్టడం వలన మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్లడ్ డొనేషన్ రీజనల్ చైర్మన్ కే శ్రీనివాసరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ గల్లా సాంబశివరావు, రెడ్‌క్రాస్ సొసైటీ ఎంసీ మెంబర్ బీవీ కృష్ణారెడ్డి, చిన్ని మురళీకృష్ణ, టీ శ్రీనివాసరావు, సుధాకరరావు, అద్దంకి లెవీ ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్సిడీపై ట్రాక్టర్లు మంజూరు

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని రైతు గ్రూపులకు కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ ద్వారా 40 శాతం సబ్సిడీపై ఎనిమిది ట్రాక్టర్‌లు మంజూరు చేసినట్లు వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నక్కబొక్కలపాడు గ్రామంలో 2, వెలమవారిపాలెం, కొప్పరపాడు, వైదన, అంబడిపూడి, బల్లికురవ, కొనిదెన గ్రామాలకు ఒక్కొక్కటి చొప్పున రూ. 15 లక్షలు వరకు ట్రాక్టర్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రూపు సభ్యులు 10 శాతం చెల్లిస్తే 40 శాతం సబ్సిడీ 50 శాతం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణం మంజూరుతో ట్రాక్టర్లు అందజేస్తున్నట్లు వివరించారు. జూన్ 1న గుంటూరులో మెగా మేళాలో భాగంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రాక్టర్లు పంపిణీ చేస్తారని కుమారి వివరించారు.

చికిత్స పొందుతూ ఆశ వర్కర్ మృతి

బల్లికురవ: రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడిన ఆశ వర్కర్ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మరణించింది. బల్లికురవ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై బండి శ్రీనివాసరావు వివరాల మేరకు.. కొమ్మినేనివారి గ్రామంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న వీర్ల సక్కుబాయి (40) భర్త అశోక్ రెండు నెలల క్రితం చనిపోయాడు. అప్పులు, అనారోగ్యంతో జీవితంపై విరక్తితో గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగువారు వైద్యానికి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయింది. మృతురాలికి ఓ కుమారుడు, కుమార్తె కలరు. శనివారం కుమారుడు వీర్ల శివకోటి ఫిర్యాదు మేరకు కేసు నమోదుతో పోస్టుమార్టం తదుపరి సక్కుబాయి భౌతికకాయాన్ని సక్కుబాయి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆకట్టుకున్న నాటికలు

పర్చూరు (చినగంజాం): ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా మండలంలోని వీరన్నపాలెం కళానికేతన్ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో 7వ జాతీయ స్థాయి నాటిక పోటీలు శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభ ఉపన్యాసం చేశారు.

అధైర్యపడకండి.. అండగా మేమున్నాం

- ఆనందరావు కుటుంబ సభ్యులకు పరామర్శ
- ఎమ్మెల్యేలు బాలినేని, కరణం, ఎమ్మెల్సీ సునీత



ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు బాలినేని, కరణం, ఎమ్మెల్సీ సునీత, వెంకటేష్

చీరాల టౌన్: సివిల్స్ పరీక్షలు రాసి జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లాల్సిన గోలి శ్రావణి (25) మరణం బాధాకరం.. బిడ్డను కోల్పోయిన వైఎస్సార్ సీపీ నేత, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ గోలి ఆనందరావు, కుమారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి తాము ఎప్పుడు అండగా ఉంటామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఈపురుపాలెంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న గోలి ఆనందరావు, కుమారి దంపతుల కుమార్తె శ్రావణి ఇంటికి ఎమ్మెల్యే బాలినేని చేరుకుని కుటుంబ సభ్యులు పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, నియోకజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, చీరాల ఆర్డీవో పి.సరోజిని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, నాయకులు గోలి ఆనందరావు ఇంటికి వెళ్లి శ్రావణి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఈసందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి చురుకుగా పనిచేసే ఆనందరావు కుటుంబంలో విషాదం జరగడం బాధాకరమన్నారు. సివిల్స్‌లో ఉన్నతస్థాయికి వెళ్లాల్సిన శ్రావణి అకాల మరణం చెందడం ఆ కుటుంబానికి తీరనిలోటన్నారు. బాలినేని వెంట ఒంగోలు బీసీ సెల్ అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, మాజీ సర్పంచ్‌లు గోలి అంజలీదేవి, పాలపర్తి నాగేశ్వరరావు, నాయకులు గోలి వెంకటరావు, బిత్రా శ్రీను, నాదెండ్ల కోటేశ్వరరావు, గోలి గంగాధర్, ఎం.వెంకటరావు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు. అలానే మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమంచి వెంట జెడ్పీటీసీ ఆకురాతి పద్మినీ, మాజీ సర్పంచ్ గోలి అంజలీదేవి, గంజి వెంకటేశ్వర్లు, నాయకులు గట్టు సుబ్బారావు, పలువురు నాయకులు ఉన్నారు.

ప్రజల కోసమే పుట్టింది వలంటీర్ల వ్యవస్థ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: ముందు చూపుతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం దేశం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వార్డు వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కరణం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ పారదర్శకమైన పాలన అందించే ప్రయత్నంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి గృహాల సాధక బాధలన్నీ వలంటీర్లు పాలుపంచుకునేలా ఏర్పాటు చేయడం అద్భుతమన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని ఎందరో మేధావులు, దార్శనికులు పరిపాలించారని, ప్రతి ఇంటికి ఒక బాధ్యతగా సేవలందించే ఒక వలంటీర్‌ను నియమించిన దాఖలాలు లేవన్నారు. పార్టీలకు అతీతంగా ఈ వ్యవస్థను దేశంలో ప్రతి ఒక్క ప్రజాప్రతినిధులు కొనియాడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు అవుతున్న తీరుతో పాటు అన్ని సేవలను వలంటీర్ల ద్వారా చేయించడం రాష్ట్రంలోనే అన్ని వర్గాల వారికి చాలా సంతృప్తిగా ఉందన్నారు. వలంటీర్ల వ్యవస్థతో దళారి వ్యవస్థ మాయమైందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు జరుగుతున్న మేలు వలంటీర్లు కూడా పాలు పంచుకుని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.సరోజిని, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, ఎంపీడీఓ నేతాజీ, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బీ కేశవులు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పులి వెంకటేశ్వర్లు, ఎరిపిల్లి రమణ, బుర్ల సాంబశివరావు, గవిని నారాయణ, ధనుంజయ, అంకాలరెడ్డి, గడ్డం శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, కావూరి యాదలరెడ్డి, బుర్ల మురళి, అద్దంకి రెడ్డి, గుంటూరు సుబ్బారావు, షేక్ మస్తాన్, తేళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరం, డిప్యూటీ తహసీల్దార్ ఆఫీస్‌లను ఇటీవల ఆధునికీకరించిన నేపథ్యంలో శనివారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు ప్రారంభించారు.

పోలీసుల దెబ్బలకు ఆస్పత్రిపాలైన బాధితుడు



అస్వస్థతకు గురైన లక్ష్మయ్య

మార్టూరు: పోలీసు అధికారులు విచారణ పేరుతో విచక్షణా రహితంగా కొట్టిన దెబ్బలకు బాధితుడు ఆస్పత్రి పాలయ్యాడు. ఈఘటన శనివారం రాత్రి మండలంలోని చిమ్మిరిబండ గ్రామ ఎస్సీ కాలనీలో కలకలం రేపింది. బాధితుడు అతని కుటుంబ సభ్యులు, ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిన్నగోని వెంకన్న తన నివాసంలో రూ.43 వేల నగదు అపహరణకు గురైందని చోరీకి పాల్పడిన వ్యక్తి అదే గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన మురుగుల లక్ష్మయ్యగా పేర్కొంటూ వెంకన్న కుమారులు నవీన్, నాగేంద్రబాబులు ఈ నెల 24వ తేదీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఎస్సై 25వ తేదీ రాత్రి లక్ష్మయ్యను స్టేషన్‌కు పిలిపించి విచారించాడు. విచారణలో భాగంగా తాను దొంగతనం చేయలేదని తనకు షుగర్ తదితర అనారోగ్యాలు ఉన్నాయని లక్ష్మయ్య ఎంత మొత్తుకున్నా వినకుండా ఏఎస్ఐ సైదా, రైటర్ సాయిలు ఎస్సైతో కలిసి తనను తలకిందులుగా వేలాడదీసి విచక్షణా రహితంగా కొట్టినట్లు బాధితుడు విలేకరులతో వాపోయారు. పోలీసుల దెబ్బలకు భయపడి తాను చోరీ చేసినట్లు ఒప్పుకున్నానని శుక్రవారం రాత్రి ఎస్సై కమలాకర్ రూ.20 వేలు నగదు జూన్ 15వతేదీ నాటికి తాను వెంకన్న కుటుంబానికి ఇవ్వాలని చెప్పాడన్నారు. లేకపోతే రాత్రి ఇచ్చిన కోటింగ్ మరలా ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించి తనను ఇంటికి పంపించినట్లు శనివారం ఉదయం బాధితుడు విలేకరులకు తెలిపారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో లక్ష్మయ్య హఠాత్తుగా తీవ్ర అస్వస్థకు గురవడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బంది సాయంతో మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు లక్ష్మయ్యను 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఈ విషయమై ఎస్సై కమలాకర్‌ను వివరణగా కోరగా తాను లక్ష్మయ్యపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకోలేదని కేవలం విచారణ మాత్రమే చేపట్టినట్లు ఆయన చెప్పడం గమనార్హం. చేయని నేరానికి లక్ష్మయ్యపై భౌతిక దాడులకు పాల్పడిన పోలీసులు అధికారులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులను కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలోని పేదలకు టైమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 32 టాయిలెట్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధి పూనాటి రవీంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే ప్రధాన అంశంతో గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో టాయిలెట్స్ నిర్మాణాలను చేపట్టామని. ఇప్పటి వరకు 142 వరకు నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఈ నిర్మాణాలకు ఆర్థిక సాయాన్ని అందచేస్తున్న గ్రామస్తులకు, జెడ్పీ హెచ్ఎస్ పూర్వ విద్యార్థులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 1984 బ్యాచ్ విద్యార్థులు అత్యధికంగా రూ.5 లక్షలు సాయాన్ని అందజేసినట్లు రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో పూనాటి సుబ్బారావు, మోపర్తి వెంకట్రావు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి బాధాకరం



రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొనపాటి రాధాకృష్ణ (51) ఈనెల 10న ఉపాధి పనికి వెళ్లి పనిచేస్తూ గుండెపోటుతో మరణించాడు. రాధాకృష్ణ దశదిన కర్మకు శనివారం ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పాల్గొని రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు.

అనారోగ్యంతో మార్టూరు వీఆర్‌ఓ మృతి



మార్టూరు: గత కొంత కాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్న మార్టూరు సచివాలయం -4 వీఆర్‌ఓ గుంటక శ్రీనివాసరెడ్డి (55) శనివారం మార్కాపురంలోని ఆయన స్వగృహంలో మరణించారు. సుమారు ఐదేళ్ల నుంచి అనారోగ్యంతో సెలవులో ఉన్న శ్రీనివాసరెడ్డి మృతి చెందిన విషయం తెసుకొని బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్, తహసీల్దార్ వెంకటరెడ్డి, డీటీ మెహతాజ్ బేగం ఇతర రెవెన్యూ సిబ్బంది ఆయన కుటుంబానికి సంతాపం తెలియజేశారు. మృతుడు శ్రీనివాసరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీసీఎస్ పెన్షన్ కోసం దరఖాస్తు చేయాలి

చీరాల అర్బన్: ఏపీఎస్ఆర్టీసీలో పనిచేసిన విశ్రాంత కార్మికుల నుంచి సీసీఎస్ వారు వృద్ధాప్య పెన్షన్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిటైర్డు కార్మికుల అసోసియేషన్ డిపో కమిటీ కార్యదర్శి సీహెచ్ చంద్రశేఖరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30, 2022 నాటికి 59 సంవత్సరాల నిండిన వారు, ఆర్ఎంఎస్ఎస్ డిపాజిట్ రద్దు చేసి ఆరు నెలలు నిండినవారు అర్హులని తెలిపారు. ఎస్‌బీఐ పాస్‌బుక్ మొదటి పేజీ, గుర్తింపు కార్డు మొదటి పేజీ జిరాక్స్‌లతో జూన్ 25వ తేదీలోపు డిపో కమిటీకి అందించాలన్నారు. కావునా పెన్షనర్లు విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్‌లు



వలంటీర్లను సత్కరించి, ధ్రువపత్రాన్ని అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కృష్ణచైతన్య

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా నిలుస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మామిళ్లపల్లి గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. జగనన్న చేస్తున్న మేలును వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం వలంటీర్లకు సేవారత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రధానంలో భాగంగా శాలువ కప్పి ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, మండల అధ్యక్షులు, ఎంపీపీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అర్హతకలిగిన ప్రతి ఒక్కరికీ పథకాలు..

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు.